క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న మంత్రి సీతక్క



ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కన్వాయిలో హుటాహుటిన మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలించి మంత్రి సీతక్క మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో వైద్య శిబిరానికి హాజరై తిరిగి మంత్రి సీతక్క వెళ్తుంది. ఈ క్రమంలో తాడ్వాయి–చిన్నబోయినపల్లిలో రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడిన వ్యక్తి రోడ్డుపై కనిపించాడు. వెంటనే తన వాహనాన్ని నిలిపి సహాయకులు, పోలీసులతో మరో వాహనంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలను కాపాడారు. ఆమె వెంట ఇర్సవడ్ల వెంకన్న, తదితరులు ఉన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన కనకం సాంబయ్య, మండలంలోని పొట్లాపూర్ గ్రామానికి చెందిన పెండకట్ల రాజ్ కుమార్, చింతకుంట గ్రామానికి చెందిన పోరిక చెంచు లక్ష్మి, ఇంచర్ల గ్రామానికి చెందిన నూనె లక్ష్మి, మదాసు మొగిళి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆదివారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలేపు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మురళి, ఆదిరెడ్డి, స్వరూప, రాజయ్య, రాంబాబు, శ్రీనివాస్, కోటి, ఉమారెడ్డి, మహేష్, అనిల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర గ్రామ శివారుల్లో ఆదివారం ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వాజేడు మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

నియామకం



రేగొండ: మండల కేంద్రంలో ఆదర్శ రైతు సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పత్తి తిరుపతి, ప్రధానకార్యదర్శిగా అడప రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా గంట్ల వెంకటరమణారెడ్డి, గౌరవ సలహాదారుగా లింగంపల్లి బాబురావు, ఉపాధ్యక్షుడిగా ముద్దమల్ల రమేశ్, కార్యదర్శిగా పప్పుల చంద్రమౌళి, కోశాధికారిగా నాంఢ్రె రవీందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వం లోలాగా తమను ఆదర్శ రైతులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆనందం, రాజయ్య, గుగులోత్ చంద్రమౌళి నాయక్, బోయిని వేణు, బోడిగే భాస్కర్, కుమారస్వామి, రాజు, వెంకటేష్, మల్లయ్య పాల్గొన్నారు.

లారీ యజమానుల సంక్షేమ సంఘం..



పోచమల్లు, అధ్యక్షుడు



శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి

కాటారం: శ్రీ చెన్నకేశవ కాటారం, మహాముత్తారం మండలాల లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు పోచమల్లు, ప్రధాన కార్యదర్శిగా బద్రి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తుడి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా చేకూర్తి జలమ్మయ్య, కోశాధికారిగా చల్ల సతీశ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని లారీ యజమానులు అభినందించారు.

పిల్లర్లకే పరిమితం

- నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు



పిల్లర్ల దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

వాజేడు: మండల పరిధిలోని పూసూరులో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ సమీపంలో 30 ఇళ్లకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. పునాదులు వేసి పిల్లర్లను నిర్మించారు. ఆ తరువాత సదరు కాంట్రాక్టర్ నిర్మాణాలను కొనసాగించకుండా వదిలేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు పునాదుల్లోనే ఉండిపోయింది. కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తారని భావించారు. ప్రజలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రకటించడంతో పిల్లర్ల వరకు నిర్మించిన ఇళ్ల నిర్మాణాల ఊసే లేకుండా పోయింది. స్థలం ఉన్న పేదలకు ఇళ్లను ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం జరుగుతుందో? లేదో? అనే అనుమానాలు గ్రామస్తుల్లో ఆందోళనలో ఉన్నారు.

మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి

- మున్నూరు కాపు సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు



అభివాదం చేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం భద్రచల నియోజవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని పాలెం ప్రాజెక్టు సమీపంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఉరిసిచెట్టుకు మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహిచారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్న పెద్ద తేడా లేకుండా ఆటలు ఆడి పాటలు పాడి సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం ధనపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిట్టల మధు, భద్రాచలం నాయకులు రాజశేఖర్, ధనపనేని నాగరాజు, బెజ్జని సత్తిబాబు, జక్కుల శ్యామ్, జోన్నల నాగేశ్వరావు, తోట శ్రీను, కూసం సాంబశివరావు, మురళి, సత్యనారాయణ, దాసరి నారాయణ రావు తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

ములుగు రూరల్: సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో ఎండీ అంజాద్ పాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మల్లికార్జునరావు హాజరై మాట్లాడారు. ఈ నెల 26న నిర్వహిచే సీపీఐ ఆవిర్భావ దినోత్సవ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. కార్మికులకు, రైతులకు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని అన్నారు. మండలంలోని బొగ్గుల వాగుపైన డ్యామ్ నిర్మించినట్లయితే చాలా గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, మండల కార్యదర్శి ముత్యాల రాజు, వెంకటాపూర్ మండల కార్యదర్శి బండి నర్సయ్య, జిల్లా సమితి సభ్యులు ఇంజం కొమురయ్య, జక్కుల అయిలయ్య, బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు



ఆరోగ్యంపై ఆరా తీస్తున్న నాగజ్యోతి, లక్ష్మణ్‌బాబు



వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

ఏటూరునాగారం: ప్రజలు ఆరోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని వెంటనే చికిత్స తీసుకోవాలని రోటరీ క్లబ్ సభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. ఆదివారం మండలంలోని శంకరాజుపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 30 మంది అనుభవం ఉన్న వైద్యులతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు రూ.5.30లక్షల మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లోని ఐదు వేల మంది ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అనారోగ్య సమస్యలకు చికిత్సలు పొందారున్నారు. అనంతరం మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ.. ప్రజా సేవ చేయడం అదృష్టమని అన్నారు. లక్ష్మణ్‌బాబు ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రోటరి క్లబ్ అధ్యక్షుడు శారు ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కాకులమర్రి ప్రవీణ్ కుమార్, రోటరి సభ్యులు ప్రదీప్ రావు, జిల్లా మాజీ గ్రంథాలయం చైర్మన్ గోవింద్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, మల్లారెడ్డి, తాడూరి రఘు, వలీబాబా, జిల్లా మెడికల్ షాపుల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, కంటి ప్రముఖ వైద్య నిపుణులు శరత్, వైద్యులు విజయ్ కుమార్, నరేష్, సతీష్, ప్రసాద్, సుధాకర్, రాజేశ్వర్ రెడ్డి, ఉత్తమ్ ప్రవీణ్, హేమంత్ రెడ్డి, లక్ష్మణ్, దివ్య దాత్రి, శ్రీపాల్, చరణ్, ప్రతీక్ రెడ్డి పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

టేకుమట్ల: న్యూసెన్స్ చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు పక్కన బజ్జీల బండి నడుపుకుంటున్న చిలుక రాజు వద్ద మండల కేంద్రానికి చెందిన బొమ్మ రంజిత్‌తో పాటు మరో ముగ్గురు ఆదివారం సాయంత్రం బజ్జీలు కొనుక్కునే విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో బజ్జీల బండిని పడేశారు. ఈ మేరకు చిరు వ్యాపారి రాజు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చలి మంటలు వేసుకున్న ప్రజలు



పెరిగిన చలి

వెంకటాపురం(కె) మండలంలో చలి తీవ్రత పెరిగిపోయింది. ఆదివారం ఉదయం చలి ఎక్కువగా ఉండటంతో ప్రజలు గ్రామ కూడళ్లలో మంటలు వేసుకోని చలి కాగారు. బయటకు వెళ్లే వారు సైతం స్వెటర్లను ధరించి ప్రయాణిస్తున్నారు. ఉదయం పొగమంచుతో మండల కేంద్రం ఆహ్లాదకరంగా మారింది.

– వెంకటాపురం(కె)



స్వెటర్లతో బైక్‌పై వస్తున్న వాహనదారులు

మహా ధర్నాను విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు స్వామి



మాట్లాడుతున్న స్వామి

వాజేడు: హైదరాబాద్‌లో రేపు(మంగళవారం) నిర్వహించనున్న చేయూతదారుల మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పలు సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.4016 నుంచి రూ.6,000, ఇతర చేయూత పింఛన్ రూ.2016 నుంచి రూ.4000, కండరాల క్షీణత పింఛన్ రూ.4016 నుంచి రూ.15000 లకు పెంచుతానని ఇంత వరకు పెంచలేదన్నారు. ఈ పింఛన్ల సాధన కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ చేయూత మహా ధర్నాకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. నాయకులు లేగల రవి, బల్సుపాటి స్వామి, చిట్యాల రాకేష్, పేట సమ్మయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థి శీలం త్రినేశ్ అండర్–14 ఖో–ఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈఓ కొర్ర సారయ్య, ఎస్సై గూడ అరుణ్ స్కూల్ ఆవరణలో ఆదివారం అభినందించారు. అనంతరం ఎంఈఓ సారయ్య, ఎస్సై అరుణ్ మాట్లాడారు. త్రినేశ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం త్రినేశ్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)కోట రాంబాబులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లడానికి అయ్యే ప్రయాణ ఖర్చుల కోసం త్రినేశ్‌కు రిటైర్డ్ తెలుగు పండిట్ కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, అబిద తబస్సుం, ఉమామహేశ్వర్, రవికుమార్, గోపాల్‌రావు, భిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజ పాల్గొన్నారు.

'ఏం చేశారని విజయోత్సవాలు'

- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

ములుగు రూరల్: సంవత్సర కాలంలో ఏం చేశారని సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవలు నిర్వహిస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా నాగరాజు హాజరై మాట్లాడారు. డిసెంబర్ ఒకటి నుంచి తెలంగాణలో స్కూల్స్, కాలేజీల్లో కూడా విజయోత్సవాలు నిర్వహించలని సీఎం అంటున్నారని విద్యార్థులకు ఏమి ఒరగపెట్టారని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గినేని భాను, కార్యదర్శి మహేష్, అధికార ప్రతినిధి విక్రాంత్, కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, దిలీప్, వంశీ పాల్గొన్నారు.

డిసెంబర్ 1న మాలల సింహగర్జన



మాలల సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాళేశ్వరం: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. ఆదివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో మాలల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్‌గా బందెల శ్రీనివాస్, కోకన్వీనర్లుగా బందెల రాములు, కోల రమేష్, రేవెల్లి సతీష్, బండి శ్రీనివాస్, నీలం శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలల సింహగర్జనకు లక్షలాది మాలలు, అనుబంధ కులాలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభను విజయవంతం చేసి రిజర్వేషన్లను కాపాడుకుందాం అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కోకన్వీనర్ బుర్రి శివరాజు, మండల కన్వీనర్ నీర్ల ప్రభాకర్, రేవెల్లి నాగరాజు, మాదరి మధు, రాజబాపు, కాళేశ్వరం నాయకులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం..

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సడువలి



మాట్లాడుతున్న నాయకులు

కాటారం: కాంగ్రెస్ పార్టీపై మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకుండేది లేదని కాంగ్రెస్ మహాముత్తారం మండల అధ్యక్షుడు సడువలి హెచ్చరించారు. మహాముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంతోషాన్ని జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గడిచిన పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండి ప్రజా సంక్షేమం మరచి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేసి రూ.లక్షల కోట్ల ప్రజా ధనాన్ని ప్రాజెక్టుల పేరిట దోచిందన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ వంశీరాజ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజమల్లు, రాజునాయక్, రవి, మల్లయ్య, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడిన కారు



బోల్తా పడిన కారు

గణపురం: అతి వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడిన ఘటన ఆదివారం సాయంత్రం గణపురం మండలంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని అంకీసకు చెందిన మనోజ్ కుమార్‌శంకరమూర్తి అనే వ్యక్తి అతడి కుటుంబ సభ్యులతో కలసి వరంగల్ నుంచి గణపురం మండలకేంద్రంలోని వారి బంధువుల ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతను గమనించకుండా అతి వేగంగా రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి పడిపోయి కారు బోల్తా పడింది. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

మొక్కజొన్న వైపు మొగ్గు



మొక్కజొన్న వేసేందుకు దక్కిని సిద్ధం చేస్తున్న రైతు



మొక్కజొన్న విత్తనాలను విత్తుతున్న రైతు

- నష్టాలను మిగిల్చిన పత్తి పంట
- పత్తి తీసి మక్కలు వేస్తున్న రైతులు

టేకుమట్ల: ఈ సంవత్సరం రైతులకు ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడి రాలేదు. మండలంలో 8340 ఎకరాలకు పైగా పత్తి పంట సాగు చేయగా సుమారు 70శాతం అధిక వర్షాల వల్ల ఎదుగుదల లోపించి తెగుళ్ల బారిన పడింది. పత్తి పంట ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 10 క్వింటాళ్ల లోపే దిగుబడి రావడంతో కనీసం పెట్టుబడి రాకపోవడంతో యాసంగి పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. పత్తి పంటను తీసేసి మొక్కజొన్న పంట సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలో ఇప్పటికే కొంత మంది మొక్కజొన్న వేయగా సుమారు 2వేల ఎకరాలల్లో సాగుకు దుక్కులు సిద్ధం చేశారు.

అవగాహన లోపంతో..

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించకుండా పంటలు సాగు చేయడం వల్ల నష్టాలను చవిచూస్తున్నారని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ ఎరువుల వినియోగం, నేల స్వభావాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని అధికారుల సలహాలతో పంటలను సాగు చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.

మూడెకరాల్లో పత్తి తీసేశా..



నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని ఎకరంలో మిరప, మూడెకరాల్లో పత్తి పంటను సాగు చేశా. పత్తి పంట ఎదగక పోవడంతో పాటు, కుళ్లు రావడంతో పంటను పూర్తిగా తీసేసి మొక్కజొన్న పంటకు సిద్ధం చేశా. నీళ్ల సదుపాయం ఉంది కావున యాసంగిలో మొక్కజొన్న పంట వేస్తున్నా.

– బండి కుమార్, కౌలు రైతు, అంకుషాపూర్

మొక్కజొన్న వేస్తా..



పత్తి పంట పూర్తిగా నష్టాలను మిగిల్చడంతో యాసంగిలో మొక్కజొన్న వేసేందుకు పత్తిని తీసేస్తున్నా. మరో వారంలో మొక్కజొన్న పంటను వేస్తా. వానాకాలం నష్టాలను మిగల్చగా యాసంగిలోనైనా లాభాన్ని పొందాలనుకుంటున్నా.

–సాద రఘు రైతు, టేకుమట్ల

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ రవితేజ ఇంట్లో ఉదయం ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూటై మంటలు వచ్చాయని తెలిపారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలి బుడిదైయిందని తెలిపారు. సూమారు రూ.లక్ష మేర ఆస్థి నష్టం జరిగిందన్నారు.